
ప్రజాశక్తి
ఆదివారం 28 జులై 2024
5
పార్వతీపురం మన్యం



జిల్లా జడ్జిని కలిసిన ఎస్‌పి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.సాయి కళ్యాణ్ చక్రవర్తిని శనివారం పార్వతీపురం జిల్లా కోర్టులో ఎస్‌పి ఎస్.వి.మాధవరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులను తగ్గించడానికి , లోక్ అదాలత్ ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే విధంగా న్యాయశాఖ, పోలీసు శాఖలు సమన్వయంతో పని చేయడంపై చర్చించారు.



ప్రధాన న్యాయమూర్తికి పూలమొక్క అందిస్తున్న ఎస్‌పి



గదబవలస బ్రిడ్జి వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సిఐ, ఎస్ఐ తదితరులు

ఏజెన్సీలో కూంబింగ్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఈ నెల 28 నుంచి ఆగస్టు మూడో తేది వరకు మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా ఎల్విన్‌పేట పోలీసులు అప్రమత్తమయ్యారు. మావోయిస్టుల కదలికలపై పోలీసులు డేగ కన్ను వేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందస్తుగా పోలీసులు అప్రమత్తమయ్యారు. పోలీస్ స్టేషన్లో భద్రత కట్టుదిట్టం చేశారు. శనివారం సిఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ముమ్మరంగా కూంబింగ్ చేపట్టారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోని ప్రధానరహదారి ఇరువైపులా ఉన్న కల్వర్టుల వద్ద ఎస్‌టిఎఫ్ పార్టీలు, బాంబు డిస్పోజల్ టీంతో తనిఖీలు చేపట్టారు. ఎల్విన్‌పేట చెక్‌పోస్ట్ వద్ద ఒడిశా, శ్రీకాకుళం ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనాలను తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ షణ్ముఖరావు, పోలీసులు ఉన్నారు.

పక్కాగా ఇసుక సరఫరా

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఇసుక సరఫరా పక్కాగా చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక సరఫరా ఉచితమేనని, ఇసుక తవ్వి తీయడం, ఇతర నిర్వహణ, రవాణా ఖర్చులను మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఇతర ఖర్చులు ఏమీ ఉండవని, దానిని అధికారులు పక్కాగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. స్థానికంగా ఉండే చిన్న రీచ్‌లకు మార్గదర్శకాలు రావలసి ఉందన్నారు. అటువంటి చోట్ల జెసిబిలు వినియోగించరాదని స్పష్టం చేశారు. ఇసుక రీచ్‌ల వద్ద తాగునీటి వసతులు, ఇతర మౌలిక సదుపాయాలు దెబ్బతినరాదన్నారు. ఒడిశా అనుమతులతో ఆంధ్రా ప్రాంతంలో తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయని, దీనిపై దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా అనుమతులు లేని రీచ్‌లలో తవ్వకాలు చేపట్టకూడదన్నారు. అనుమతులు లేని చోట్ల ఇసుక తవ్వితే భారీగా అపరాధ రుసుం విధించాలని, వాహనాలు సీజ్ చేయాలని సూచించారు. ఇసుక సరఫరా పక్కాగా జరగాలని, ప్రతి అంశానికీ రికార్డులు నిర్వహించాలని ఆదేశించారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రీచ్‌లు నిర్వహించాలన్నారు. జిల్లాకు అవసరమగు ఇసుక అవసరాలను గుర్తించి కార్యాచరణ ప్రణాళికను తయారు చేయాలని ఆయన ఆదేశించారు. వంశధార నదీ తీరంలో కొత్త ఇసుక రీచ్‌ల లభ్యతను గుర్తించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు 43 ప్రకారం ఈ నెల 8 నుండి ఉచిత ఇసుక విధానం అమల్లోకి వచ్చిందని తెలిపారు. కిలోమీటర్ల దూరం మేర రవాణా ఛార్జీలు విధిస్తామని, దీనిని ఖరారు చేస్తామని చెప్పారు. సమావేశంలో ఎస్‌పి ఎస్.వి.మాధవ రెడ్డి, పార్వతీపురం, పాలకొండ ఆర్‌డిఒలు కె.హేమలత, వి.వెంకటరమణ, జిల్లా గనుల శాఖ అధికారి కె.శ్రీనివాసరావు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా రవాణా అధికారి ఎం.శశికుమార్, జిల్లా భూగర్భ జలాల శాఖ అధికారి ఎ.రాజశేఖరరెడ్డి, వంశధార ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

భామిని మండలం కాట్రగడ వద్ద అనుమతుల మేరకు ఇసుక వెలికి తీసి 10 రోజుల్లో కార్యకలాపాలు మొదలు పెట్టాలని జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్ణయించింది. నేరేడి, పసుపూడి వద్ద ఇసుక రీచ్‌లను ప్రారంభించేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని కూడా నిర్ణయించింది.

9న నీలకంఠాపురంలో ఆదివాసీ దినోత్సవం

- గిరిజన ప్రజాప్రతినిధుల సమావేశంలో నిర్ణయం

ప్రజాశక్తి - కురుపాం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆగస్టు 9న మండలంలో నీలకంఠాపురం గ్రామంలో నిర్వహిస్తున్నట్లు సర్పంచులు ఐ.గౌరీశంకర్, ఎ.మన్మథరావు తెలిపారు. సర్పంచులు, ఎంపిటిసిలు, మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రజలు కలిసి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనివారం మండలంలోని నీలకంఠాపురంలో ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లపై టిఆర్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఐ.రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి 10 పంచాయతీల ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై, చర్చించారు. సమావేశంలో మాజీ ఎంపిపి హెచ్.నీలకంఠేశ్వరరావు, వైస్ ఎంపిపిలు అన్నాజీరావు, రంగారావు, సర్పంచులు టి.లోకనాథం, హెచ్.నాగేశ్వరరావు, బి.మిన్నారావు, బి.రాజయ్య, కె.సులోచన, వి.జ్యోతి, ఎంపిటిసి జి.విద్యారాణి తదితరులు పాల్గొన్నారు.

శివ్వాం దళితులకు
ఎపి రైతు సంఘం మద్దతు

చలో కలెక్టరేట్ విజయవంతానికి పిలుపు



రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం జిల్లా నాయకులు గేదెల సత్యనారాయణ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

కలెక్టరేట్ ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన గరుగుబిల్లి మండలం శివ్వాం దళితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 11వ రోజుకు చేరాయి. ఈ దీక్షలకు ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, నాయకులు మద్దతు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శివ్వాంలో దళితులకు డి-పట్టాలిచ్చి 50 ఏళ్లు గడుస్తోందని, దానిపై కోర్టును పెత్తందారులు తప్పుదోవ పట్టించి, తప్పుడు సర్వే నంబర్లతో ఇంజెక్షన్ ఆర్డర్ తెచ్చారని తెలిపారు. దళితులు సాగు చేస్తున్న భూమిపైకి పెత్తందారులు వెళ్లి దాడి చేశారని చెప్పారు. వెంటనే వెంటనే బాధిత దళితులకు భూమిని అప్పజెప్పాలని రెవెన్యూ అధికారులను డిమాండ్ చేశారు. దళితులపై దాడి చేసిన పెత్తందారులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు.

జిల్లాలో పేదలు సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. అన్యాక్రాంతమై పెత్తందారుల చేతుల్లో ఉన్న భూములను వెంటనే తిరిగి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 11 రోజులుగా తమ సమస్యల పరిష్కారం కోసం దీక్షలు చేస్తున్న దళితులను జిల్లా అధికారులు కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అధికారుల మొండి వైఖరికి నిరసనగా ఈ నెల 29న వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, ఉపాధ్యక్షులు జి.సత్యనారాయణ, బంటు దాసు, సుంకి సర్పంచ్ కె.రవీంద్రనాథ్, కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రమణమూర్తి, సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఎస్.ఉమామహేశ్వరరావు, దళిత హక్కుల సంఘం నాయకులు కోరంగి మన్మథరావు, జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై
వైసిపి కౌన్సిలర్ల ఆగ్రహం

ప్రారంభానికి ముందే సమావేశం నుంచి వాకౌట్



సమావేశం నుంచి వెళ్లిపోతున్న వైసిపి కౌన్సిల్ సభ్యులు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన శనివారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాకముందే మున్సిపల్ అధికారుల తీరుపై వైసిపి కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అజెండాలో పొందుపరిచిన అంశాలపై తమకు ముందుగా ఎందుకు తెలియజేయలేదని, వార్డు పర్యటన, పింఛన్ల పంపిణీ సమయాల్లో కౌన్సిలర్లకు కనీస సమాచారం ఇవ్వకపోవడం ఏమిటని అధికారులను నిలదీశారు. అధికారుల తీరును నిరసిస్తూ సమావేశం నుంచి వాకౌట్ చేశారు.

అనంతరం ఐదో వార్డు టిడిపి కౌన్సిలర్ కోలా సరిత.. తాగునీరు, పారిశుధ్య నిర్వహణ, ఎస్ఎన్ఎం మూర్తి నగర్‌లో భవన నిర్మాణ అనుమతులపై ప్రశ్నల వర్షం కురిపించారు. సంబంధిత మున్సిపల్ శాఖల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకటో వార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ రణభేరి బంగారినాయుడు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ఉన్న బిళ్లబందతోపాటు వరహాల గెడ్డ, పలు చెరువులు ఆక్రమణలకు గురవుతున్నా, అక్రమ నిర్మాణాలు చేస్తున్నా చర్యలు చేపట్టక పోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అజెండా చదవకుండానే..

21వ వార్డు టిడిపి కౌన్సిలర్ బడే గౌరినాయుడు మాట్లాడుతూ పదేళ్లుగా తాగునీటి సమస్య పరిష్కారంపై అధికారులు చొరవ చూపడం లేదని నిలదీశారు. పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఇంతలో చైర్‌పర్సన్ బెల్ నొక్కి సభా వేదికపై నుంచి వెళ్లిపోవడంతో టిడిపి కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి కౌన్సిలర్లు సమావేశం నుంచి వెళ్లిపోయినంత మాత్రాన అజెండా చదవకుండా, సమావేశాన్ని ముగించడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, డిఇ పి.కిరణ్ కుమార్, టిపిఒ పి.కనకారావు, ఎఇలు జి.ఆనంద్, సన్యాసిరావు, ఆర్ఒ దిబ్బ రూబేను, ఆర్ఐలు పి.నారాయణరావు, జి.వినయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నెట్‌వర్క్ సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో జియో నెట్‌వర్క్ పది రోజులుగా పనిచేయడం లేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ.. శనివారం కలెక్టరేట్ ఎఒ చంద్రమోహన్‌కు వినతి అందించారు. ఫోన్‌కాల్స్ సరిగా రావడం లేదని చెప్పారు. దీనిపై కనీస సమాచారం ఇచ్చేవారు లేరని వివరించారు. వెంటనే చర్యలు తీసుకుని, వినియోగదారులకు న్యాయం చేయాలని కోరారు. వెంటనే స్పందించిన ఎఒ జియో అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సిగ్నల్ సమస్యను ప్రాంతాల వారీగా తెలుసుకున్నారు. వెంటనే చర్యలు చేపడతామని జియో అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.ఉమామహేశ్వరరావు, బి.సూరిబాబు, లక్ష్మణ, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

31న పాలిటెక్నికల్ స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

మండలంలోని చినమేరంగి శత్రుచర్ల శశికళాదేవి ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ జి.నరేష్‌బాబు తెలిపారు. పాలిసెట్ హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, పదో తరగతి మార్కుల జాబితా, టిసి, నాలుగు నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రం.. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. మెకానికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో దాదాపు 100 సీట్లు వరకు ఖాళీ ఉన్నాయని చెప్పారు.

ఆర్థికవేత్తకు ఆ లోటు తెలియదా?

- 'సూపర్ సిక్స్'ను ఎగ్గొట్టేందుకే .. ఆ భయం
- సిఎం చంద్రబాబు తీరుపై మండిపడ్డ మాజీ డిప్యూటీ సిఎం రాజన్న దొర

ప్రజాశక్తి-మక్కువ

ఆర్థిక వేత్తనంటూ తనకు తానే గొప్పలు చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉందన్న విషయం తెలియదా? అని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఎగవేసేందుకు అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి భయాన్ని నటిస్తున్నారని విరుచుకుపడ్డారు. శనివారం వైసిపి మక్కువ మండల అధ్యక్షులు ఎం.రంగునాయుడు పుట్టినరోజు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం విలేకరులతో రాజన్నదొర మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం హయాంలో సంక్షేమ పథకాల కోసం రూ.70 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తే, అప్పటి ప్రతిపక్షం గగ్గోలు పెట్టిందన్నారు. సంక్షేమం కోసం అప్పులు చేసి రాష్ట్రాన్ని శ్రీలంకగా మార్చేస్తున్నారన్న టిడిపి నాయకులు ఈరోజు అదే సంక్షేమం కోసం వెంపర్లాడుతున్నది నిజం కాదా? అని నిలదీశారు. ఎన్నికల సందర్భంగా అమలు కాని హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక ఎలా తప్పించుకోవాలనే దారులు వెతుకుతున్నారని దుయ్యబట్టారు. అప్పులపై తప్పుడు శ్వేత పత్రాలు విడుదల చేస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు.



మాట్లాడుతున్న రాజన్నదొర

డిప్యూటీ సిఎం పవన్ నోరు విప్పాలి..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రధాన కారకులైన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై నోరు విప్పాలని రాజన్నదొర డిమాండ్ చేశారు. మైకు పట్టుకుంటే చాలు ఊగిపోయి మాట్లాడే పవన్ కళ్యాణ్ డిప్యూటీ సిఎం పదవి వచ్చాక మైకు పక్కన పెట్టేశారని ఎద్దేవాచేశారు. తల్లికి వందనం, పెట్టుబడి సాయం, నిరుద్యోగ భృతి, ఉద్యోగ కల్పన వంటి పథకాలపై బహిరంగంగా ప్రకటించాలని పవన్ కళ్యాణ్‌ను డిమాండ్ చేశారు.

వారి ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పాలి

ఏజెన్సీలో గిరిజనులకు కేటాయించాల్సిన ఉద్యోగాలు, ఇతర అంశాలపై గిరిజన సంఘాల నాయకులు అడుగుతున్న ప్రశ్నలకు గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి సమాధానం చెప్పాలని రాజన్నదొర డిమాండ్ చేశారు. ఏకలవ్య పాఠశాలల్లో గిరిజనులకు కేటాయించాల్సిన పోస్టులను గిరిజనేతరులకు ఏ ప్రాతిపదికన కేటాయించాలో చెప్పాలన్నారు. దీనిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏకలవ్య పాఠశాలల స్థితిగతులు పట్టించుకోని టిడిపి ప్రభుత్వం.. ఏకంగా తామే ఏకలవ్య పాఠశాలను ఏర్పాటు చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ దండి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బాలలతో భిక్షాటనపై ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

బాలలతో భిక్షాటన చేస్తున్న వారిపై ప్రత్యేక డ్రైవ్‌ను శనివారం చేపట్టారు. ప్రత్యేక డ్రైవ్ లో పదిమంది తల్లులు పిల్లలతో భిక్షాటన చేస్తున్నట్లు గుర్తించామని జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ తెలిపారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చామని, పిల్లలతో భిక్షాటన చేస్తే రూ.లక్ష జరిమానా, ఐదేళ్ల జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు. పిల్లలను పెంచడంలో ఇబ్బందులు ఉంటే వారిని ప్రభుత్వానికి అప్పగించాలని, వారిని నిబంధనల ప్రకారం దత్తత ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో పిల్లల సంరక్షణ అధికారులు ఎం. ప్రసాదరావు, అరసవిల్లి నాయుడు, లీగల్ కం ప్రొబిషన్ ఆఫీసర్ పి.శ్రీధర్, కౌన్సిలర్ జి.తవిటినాయుడు, సోషల్ వర్కర్ దేవి, ఔట్రీస్ వర్కర్స్ హరికృష్ణ, అనీల్, రమణమ్మ, రమ్య తదితరులు పాల్గొన్నారు.



మెడకు ఉరితాళ్లు బిగించుకుని నిరసన తెలుపుతున్న సిఆర్‌టిలు

ఉరితాళ్లు బిగించుకుని సిఆర్‌టిల నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో సిఆర్‌టిలను రెన్యువల్ చేయాలని కోరుతూ సిఆర్‌టిల సంఘం, యుటిఎఫ్ ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం ఐదో రోజుకు చేరింది. నిరాహార దీక్ష శిబిరం వద్ద వినూత్నంగా ఉరితాళ్లు మెడకు తగిలించుకొని సిఆర్‌టిలు నిరసన తెలిపారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించకపోతే ఆత్మహత్యలే శరణ్యమని నినదించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థిక శాఖ అనుమతితో ఉత్తర్వులు ఇచ్చినా 47 మందిని రెన్యువల్ చేయలేదన్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఐటిడిఎ పిఒ స్పందించి ఈ సమస్య పరిష్కరించాలని కోరారు. సోమవారం కొత్తగా వచ్చిన పిఒను కలిసి తదుపరి కార్యాచరణ తెలియజేస్తామన్నారు.

29న కురుపాం మండల సమావేశం

ప్రజాశక్తి - కురుపాం

ఈ నెల 29న స్థానిక వెలుగు కార్యాలయం వద్ద మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి శెట్టి పద్మావతి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎస్.అప్పారావు తెలిపారు. సమావేశానికి మండలంలోని అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు. సర్పంచులు, ఎంపిటిసిలు అందరూ కూడా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

జ్యూట్ మిల్లు తెరిపించాలి

ప్రజాశక్తి-సాలూరు

మండలంలోని జీగిరాం జ్యూట్‌మిల్లు వెంటనే తెరిపించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెండేళ్ల క్రితం జ్యూట్‌మిల్లు యాజమాన్యం అక్రమ లాకౌట్ విధించడంతో వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న ఏకైక పరిశ్రమ మూతపడటంతో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లా మంత్రి సంధ్యారాణి, కలెక్టర్, ఐటిడిఎ పిఒలు మిల్లు తెరిపించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో కార్మిక సంఘం నాయకులు బి.ఈశ్వరరావు, సీతారాం, ప్రసాద్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి వై.మన్మథరావు

క్షీణిస్తున్న ఆరోగ్యం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇటీవల కాలంలో కురుస్తున్న వర్షాలకు జ్వరపీడితులు, ఇతర వ్యాధులతో బాధపడుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. దీంతో, ఆసుపత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. వర్షాల కారణంగా మలేరియా, డెంగ్యూ వైరల్ ఫీవర్‌లతోపాటు దగ్గు, తలనొప్పి వంటి అనారోగ్య సమస్యలు ఒకవైతే, కలుషిత నీటితో మరికొంతమంది అనారోగ్యం పాలవుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వాస్పత్రుల్లో రోగుల సంఖ్య మునుపెన్నడూ లేనంతగా ఉంది. ఈనేపథ్యంలో వైద్యులు కాస్త ఓపిగ్గా, మునుపటి కంటే ఎక్కువ సమయం కేటాయిస్తే తప్ప ప్రజారోగ్యం కుదుటపడే అవకాశం లేదు. ఇందుకనుగుణంగా కేవలం వైద్యలను అప్రమత్తం చేస్తే సరిపోదు. గ్రామాలు, పట్టణాలు అనే తారతమ్యం లేకుండా పరిసరాల పరిశుభ్రతకు యుద్ధ ప్రతిపాదికన చర్యలు తీసుకోవాలి. అయితే కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేయాల్సిన నిధుల్లో కోత విధించింది. వచ్చిన అరకొర నిధుల్లోనూ కొంతమంది అధికారులు చిలక్కొట్టుడు వ్యవహారాలకు తెరలేపడంతో కొన్ని పంచాయతీల్లో కనీసం బ్లీచింగ్ కూడా చల్లే పరిస్థితి లేదు. వీటికితోడు మందులు, వైద్యపరీక్షలకు అవసరమయ్యే పరికరాలు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది. ఈ పరిస్థితి పరిమితమైన పిహెచ్‌సి, సిహెచ్‌సిల్లో మాత్రమే ఉంది. ప్రతి సిహెచ్‌సిలో రోజుకు 200 నుంచి 300 వరకూ ఒపి ఉంటుందని వైద్యాధికారులు చెబుతున్నారు. జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రిలో అయితే, ఇటీవల కాలంలో 1500 నుంచి 1700 వరకు ఓపి ఉంటోంది. కొద్దిరోజులుగా మంచాలు కూడా ఖాళీగా లేవు. ఈ నేపథ్యంలో రోగులకు తగినన్ని బెడ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఓపి సేవలకు కూడా ఇటీవల ఆన్‌లైన్ సిస్టమ్ నడుపుతున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ఆధార్ కార్డుకు ఫోన్ నెంబరు లింకు ఉంటే తప్ప ఒపి సదుపాయం ఇవ్వకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అప్పుడప్పుడూ సర్వర్లు బిజిగా ఉండడం వల్ల ఫోన్ నంబర్‌కు లింకు ఉన్నవారు కూడా ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. విజయనగరం జిల్లా కేంద్రంలో మాత్రం ఇలాంటి సమస్య ఉన్నవారికి ఆఫ్‌లైన్‌లో ఓపి చీటీలు ఇస్తున్నారు. రాజాం సహా కొన్ని ఏరియా, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో లేబొరేటరీల్లో పూర్తి స్థాయిలో సదుపాయాలు లేకపోవడం వల్ల కొన్ని రకాల రక్త పరీక్షలు జరిగడం లేదు. దీంతో, ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి వస్తోంది. దీంతో, పేదలు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్యాధికారులు పాలకులు ఒకింత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంది.



ప్రజాశక్తి
www.prajasakti.com

కర్నూలు ట్రిపుల్ ఐటిలో మన్యం జిల్లా విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-విజయనగరం కోట

కర్నూలు జిల్లాలోని ట్రిపుల్ టిటలో మూడో ఏడాది ఇసిఇ చదువుతున్న పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన నల్లసాయి కార్తీక్‌నాయుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. వేసవి సెలవుల అనంతరం ఈనెల 22 నుంచి తరగతులకు హాజరయ్యాడు. ఈక్రమంలో శనివారం ట్రిపుల్ ఐటి భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కర్నూలు సర్వజన ఆస్పత్రికి తరలించారు. విద్యార్థి సూసైడ్ నోట్ రాసినట్లు తెలిసింది. అధ్యాపకులు మందలించడం వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిహెచ్‌సిలో తనిఖీలు

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సీతంపేట ఐటిడిఎ పిఒ టి.రాహుల్ కుమార్ రెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు జ్వరాల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆసుపత్రిలో రోగులకు ఏమేరకు వైద్యం అందుతుందో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి భాను ప్రతాప్, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో మల్లి ఆశ్రమ పాఠశాలను శనివారం ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ పి.నారాయుడు ఆకస్మికంగా సందర్శించారు. విద్యాబోధన జరుగుతున్న తీరును పరిశీలించారు. పాఠశాలలో మొక్కలు నాటారు. ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని హెచ్‌ఎంను ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐలో రెండో విడత అడ్మిషన్లు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

భద్రగిరి ఆర్ఐటిఐలో రెండో విడత కౌన్సిలింగ్ ప్రక్రియ శనివారం నిర్వహించారు. విద్యార్థుల నుంచి 154 దరఖాస్తులు వచ్చాయి. 74 సీట్లకు అడ్మిషన్లు స్వీకరించినట్లు ప్రిన్సిపల్ సిహెచ్.సునీల్ కుమార్ తెలిపారు.

బైపాస్ రోడ్డుకిరువైపులా మొక్కలు

ప్రజాశక్తి-సాలూరు

పట్టణానికి చెందిన బైపాస్ రోడ్డుకు ఇరువైపులా రోటరీ క్లబ్ ఆధ్వర్యాన మొక్కలు నాటారు. పట్టణానికి చెందిన కొంతమంది దాతలు, వ్యాపారుల సహకారంతో శనివారం టౌన్ సిఐ వాసు, బంగారం షాపు యజమాని కోలగట్ల గోపి, మాజీ కౌన్సిలర్ పి.గోపి, రిటైర్డ్ హెచ్‌ఎం కె.ప్రసాదరావు మొక్కలు నాటారు. పర్యావరణ సమతుల్యత కాపాడడం, బైపాస్ రోడ్డుని ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి రోటరీ క్లబ్ సభ్యులు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-వీరఘట్టం

ఆధార్ సేవలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని తహశీల్దార్ కె.జయ ప్రకాష్ అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విఆర్ఒల సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సింహాచలం, జి.రాజేంద్రప్రసాద్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

'బిహెచ్' వాహనదారులు పన్ను చెల్లించాల్సిందే

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

బిహెచ్ సిరీస్ రిజిస్ట్రేషన్ల నంబర్లతో రాష్ట్రంలో నడుపుతున్న వాహనాలకు వెంటనే పన్నును చెల్లించాలని జిల్లా రవాణా శాఖ అధికారి ఎం.శశికుమార్ తెలిపారు. ఒకే దేశం, ఒకే రిజిస్ట్రేషన్ విధానంతో ఏర్పాటు చేసిన భారత్ రిజిస్ట్రేషన్ నంబర్ కలిగి ఉంటే, దేశ వ్యాప్తంగా వాహనం వినియోగించవచ్చనే ఆలోచనలో వినియోగదారులు ఉన్నారని చెప్పారు. కానీ బిహెచ్ రిజిస్టేషనుతోపాటు సంబంధిత రాష్ట్రంలో పన్ను చెల్లించి మాత్రమే వాహనాన్ని వినియోగించాలని ఆయన స్పష్టం చేశారు. బిహెచ్ సిరీస్ వాహనాలపై ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.

గిరిజనులకే ఉద్యోగాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గిరిజన విద్యాసంస్థల్లో ఆదివాసీలకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్లా సురేష్ కోరారు. ఏకలవ్య పాఠశాలల్లో పనిచేస్తున్న సిఆర్‌టిలను తొలగించి వారి స్థానంలో కేంద్ర ప్రభుత్వం రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించడంతో గిరిజనులు ఉద్యోగాలు కోల్పోయారని తెలిపారు. జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో కేవలం గిరిజనేతరులను గురుకుల సొసైటీలో నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. గిరిజనులు ఉండగా వారిని కాదని గిరిజనేతరులను నియమించడం దారుణమని చెప్పారు. గతంలో పనిచేసిన గిరిజనులకు ఉపాధి కల్పించాలని, జిల్లా మంత్రి స్పందించాలని కోరారు.

తహశీల్దార్ జయప్రకాశ్‌కు ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి-వీరఘట్టం

ఎన్నికల బదిలీల్లో భాగంగా వీరఘట్టం తహశీల్దారుగా విధుల్లో చేరిన కె.జయప్రకాశ్ తిరిగి సొంత జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం ఆయనకు మండల రెవెన్యూ ఉద్యోగులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఆయనకు సత్కరిస్తూ జ్ఞాపికలను అందజేశారు. డిటి సిహెచ్ సత్యనారాయణ, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలో పారిశుధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం చాలా అవసరమని మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ కోరారు. శనివారం పట్టణంలోని నాయుడువీధి, అక్కేనవీధుల్లో డ్రై డే సందర్భంగా కమిషనర్ ప్రసన్నవాణి తో కలిసి ప్రజలకు పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించారు. ఇళ్లలో గాని, ఇంటి పరిసరాల్లో గాని నీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

స్వచ్ఛంద సంస్థలు సహకారాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ ఎన్.సత్యనారాయణ కోరారు. ఎస్ సొసైటీ రెండో వార్షికోత్సవం సందర్భంగా శనివారం కార్యదర్శి షేక్ గౌస్ శివన్నపేట పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను వితరణ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.గౌరీశంకర్ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

ప్రజాశక్తి-సీతానగరం

పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా టీకాలు వేయాలని పశు వైద్యాధికారి ఎస్.రామారావు అన్నారు. స్థానిక పశువైద్య శాఖ కార్యాలయంలో శనివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాక్సినేషన్ వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-పాచిపెంట

పాంచాలి సర్పంచ్ గూడెపు యుగంధర్ కుమార్తె లక్ష్మి ఢిల్లేశ్వరి పుట్టినరోజు సందర్భంగా శనివారం అన్నదానం చేశారు. సాలూరు ఫ్రెండ్స్ అనే స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో సాలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో 80 మంది రోగుల సహాయకులకు భోజన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మికి పలువురు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

సంకల్పం ఉంటే విజయం దాసోహం

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

యువతకు లక్ష్యాన్ని సాధిస్తామన్న దృఢ సంకల్పం ఉంటే విజయం దాసోహం అవుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. స్థానిక శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్‌పై ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని స్టూడెంట్స్ సక్సెస్ సొసైటీ సహకారంతో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహించడం చాలా అవసరమన్నారు. అందులో భాగంగా జిల్లాలో గ్రామ విజ్ఞాన వికాస కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. యువత నిరంతర సాధన, విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరిలో మేధాశక్తి ఉంటుందని, ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేస్తే సాధించ లేనిది ఏదీ ఉండదని యువతలో స్ఫూర్తిని, ఉత్సాహాన్ని నింపారు. ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని లక్ష్య సాధనలో ఆటుపోట్లను అధిగమించి విజయం సాధించాలని ఆకాంక్షించారు. లక్ష్య సాధనలో నిరాశపరిచే వారు, ఆటంకాలు సృష్టించేవారు ఉంటారని, అయినా పరిస్థితులను అనుకూలంగా మలుచుకుని గమ్యాన్ని చేరుకునేందుకు శ్రమించాలని సూచించారు. ప్లానింగ్, ప్రజెంటేషన్, ప్రిపరేషన్ విజయానికి సోపానాలని తెలిపారు. పోటీ పరీక్షలలో భయం విడనాడి ఆత్మ విశ్వాసంతో సిద్ధం కావాలని చెప్పారు. యువతకు ఎంచుకున్న రంగంలో సాధించాలన్న తపన, పట్టుదల ఉండాలని అభిప్రాయపడ్డారు.

విద్యార్థులకు అవసరమైన కెరీర్ గైడెన్స్ పుస్తకాలను కలెక్టర్ అందజేశారు. ముందుగా కళాశాల ఆవరణలోని మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలామ్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత వైస్ చాన్సలర్ ముద్రు ముత్యాల నాయుడు, అసోసియేట్ ప్రొఫెసర్ కొచేర్ల శంకరరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగిరెడ్డి వెంకటస్వామి నాయుడు, కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్. చలపతిరావు, లోకబంద విద్యాసంస్థల చైర్మన్ టి.ఎన్.ఎస్.కార్తీక్, ఎపిఐఐసి అధికారి బాడాన హరి, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై యువతకు అవగాహన కల్పించాలి

పార్వతీపురం రూరల్ : మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను గురించి యువతకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత స్వచ్ఛంద సంస్థలకు ఉందని ఎస్‌పి ఎస్.వి.మాధవరెడ్డి తెలిపారు. ఐఆర్‌పిడబ్ల్యుఎ డైరెక్టర్ పి.ప్రకాష్ శనివారం ఎస్‌పిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ యువత చెడు మార్గంలో ప్రయాణించకుండా, స్వామి వివేకానంద స్ఫూర్తితో మంచి వ్యక్తిత్వం కలిగికి సమాజంలో ఉన్న స్థాయికి ఎదగాలన్నారు. తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు, నేటి యువతకు అవగాహన సదస్సులు ఏర్పాటుచేసి వారు నైపుణ్యానికి తగ్గట్టు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐఆర్‌పిడబ్ల్యుఎ సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు వద్ద రోడ్డు ప్రమాదంలో సిపిఎం నాయకులకు గాయాలు

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం నుంచి ప్రయివేటు ట్రావెల్ బస్సులో విజయవాడ వెళ్తున్న సిపిఎం నాయకులు ప్రమాదానికి గురయ్యారు. గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు కె.గౌరీశ్వరరావు, ఐద్వా మండల కార్యదర్శి, మాజీ జెడ్‌పిటిసి కె.లక్ష్మి.. ఏలూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. శుక్రవారం సాయంత్రం బంధువులతో కలిసి విజయవాడకు ప్రయివేటు బస్సులో బయల్దేరి వెళ్లారు. శనివారం ఉదయం ఏడు గంటల సమయంలో పెదపాడు నేషనల్ హైవేపై హోటల్ వద్ద ఆగి ఉన్న లారీని ప్రయివేటు బస్సు ఢీకొంది. గౌరీశ్వరరావుకు గుండె వద్ద తీవ్ర గాయమైంది. లక్ష్మి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడ్డ వారిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు తెలిపారు. శనివారం స్థానిక జిల్లా ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంటు ఎన్.శ్రీనివాసరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వాగ్దేవి, మెడికల్ అధికారి శ్యామల, సివిల్ సర్జన్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

డిఇఒ పగడాలమ్మ



మొక్క నాటుతున్న డిఇఒ పగడాలమ్మ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మొక్కల పెంపకం ద్వారానే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని డిఇఒ పగడాలమ్మ తెలిపారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పలు ఉన్నత పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పెదబొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు చుక్క ప్రసాద్ ఆధ్వర్యంలో డిఇఒ మొక్కలు నాటారు. వాటిని సంరక్షించే బాధ్యతను ఎకో క్లబ్ కన్వీనర్ రవికిశోర్‌కు, సభ్యులకు అప్పగించారు. బందలుప్పి హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో సెక్టోరియల్ సిబ్బంది, సిఎంఒ, ఎపిఒ, ఎఎస్ఐలు పాల్గొని, విద్యార్థులతో మొక్కలు నాటించారు. నర్సిపురం హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు వెంకట నాయుడు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎ.సూర్యనారాయణ, ఎస్.మురళీమోహనరావు, నల్ల బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా అమ్మ వనం పేరుతో ప్రతి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు ఎంఇఒ సామల సింహాచలంలి తెలిపారు. శనివారం బలిజిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు, విద్యార్థుల తల్లులతో కలిసి వివిధ రకాల మొక్కలను నాటారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను వివరిస్తూ వివిధ వేషధారణలతో విద్యార్థులు చేపట్టిన ప్రదర్శన ఆకట్టుకుంది. పర్యావరణం పరిరక్షణ పెంపొందించే దిశగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బిడ్డిక భీముడు, ఉపాధ్యాయులు మురళీధర్ ఉన్నారు.

వీరఘట్టం : కంబర ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎంఇఒ-2 ఆర్.ఆనందరావు మొక్కలు నాటారు. కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు వై.లక్ష్మి అమ్మ పేరున మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

సమస్యల పరిష్కార బాధ్యత అధికారులదే

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండల సర్వసభ్య సమావేశాల్లో సర్పంచులు, ఎంపిటిసిలు లేవనెత్తిన సమస్యలకు అధికారులు పరిష్కారం చూపాలని ఎంపిపి ఎం.శోభారాణి, వైస్ ఎంపిపిలు బంకురు రవి కుమార్, సిద్ధ జగన్నాథరావు సూచించారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను వివరించారు. ఈ సందర్భంగా రావికోన సర్పంచ్ కె.రామస్వామి, తదితరులు లేవనెత్తిన ప్రశ్నలకు అధికారులు జవాబులు ఇచ్చారు. ఎంపిపి మాట్లాడుతూ గడువులో సమస్యల పరిష్కారం చూపగలిగితే సమావేశాలకు ఆదరణ పెరుగుతుందన్నారు. దీన్ని కచ్చితంగా అధికారులు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అకిబ్ జావేద్, తహశీల్దార్ కె.ఆనందరావు, ఇఒపిఆర్‌డి రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పంచాయతీకి ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి -భామిని

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఎంపిపి తోట శాంతికుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. మండలం పరిషత్ నిధులు తమ పంచాయతీలకు పూర్తి స్థాయిలో కేటాయించలేదని ఎంపిటిసి విష్ణు, పలువురు సర్పంచులు ప్రస్తావించారు. అన్ని పంచాయతీలకు ప్రాధాన్యతనిచ్చి నిధులు కేటాయించాలని కోరారు. పంచాయతీల్లో ప్రాథమిక సదుపాయాలకు నిధులు కోరితే తప్పక కేటాయిస్తామని ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం తెలిపారు.

వీధి దీపాలకు ఆన్‌లైన్ స్విచ్ ఏర్పాటుచేయాలని, గృహనిర్మాణాలు చేపట్టే కాలనీలో విద్యుత్తు, గృహనిర్మాణ శాఖ సమన్వయంతో కరెంటు లైను ఏర్పాటు చేయాలని భామిని సర్పంచ్ ప్రతినిధి లోపింటి రాజేష్ కోరారు. నూతన బొడ్డగూడ పంచాయతీలో 11 గ్రామాలుంటే రెండు చోట్ల పాఠశాలలు ఉన్నాయని, మిగిలిన గ్రామాల పిల్లలు చదవడానికి పాఠశాల ఏర్పాటుపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, మజ్జి మోహన్‌బాబు, ఎంపిడిఒ రావాడ కిశోర్ కుమార్, ఎఒ కె.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యంపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని అంటిపేట, లక్ష్మీపురం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాన్ని శనివారం ఎరువుల యాజమాన్యం, విత్తనోత్పత్తిపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ తక్కువ వర్షాలు కురుస్తున్నందున రైతులు ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలు సాగుచేయాలన్నారు. దీనివల్ల తక్కువ వర్షపాతం ఉన్నప్పటికీ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడిలు డి.భారతి, శారద, ఎఒ అవినాష్, విఎఎలు లావణ్య, వినయ్, మాజీ సర్పంచులు పైల నాగభూషణ్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

వరిలో కాలిబాటపై అవగాహన

బలిజిపేట : మండలంలోని బర్లి గ్రామంలో పాలూరు అప్పలనాయుడు, బంకురు భాస్కరరావు పొలాల్లో శనివారం ఎఒ ఎం.శ్రావణ్‌కుమార్ కాలిబాటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలిబాట తీయడం వల్ల ఎక్కువ గాలి వరి పైరులోకి ప్రవేశించి, దుబ్బులకు అధిక ఆక్సిజన్ అందిస్తుందన్నారు. దీనివల్ల మొక్కలలో కిరణజన్య సంయోగ క్రియ బాగా జరిగి, అధిక దిగుబడులిచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. చీడ పీడల ఉధృతి కూడా తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో విఎఎ వి.చాందిని, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది లక్ష్మి పాల్గొన్నారు.

ప్రాణాలకు విలువ ఇవ్వండి

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

యువత ప్రాణాలకు విలువ ఇవ్వాలని, వాహనాలను జాగ్రత్తగా నడపాలని ఎంవిఐ సత్యనారాయణ, వైద్యాధికారి నారాయణరావు సూచించారు. రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.రమణ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం ప్రమాదాలు జరుగుతున్న పరిస్థితులు, యువత వాహనాల నడుపుతున్న తీరును విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులపై తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని, ఆశలను నెరవేర్చాలన్నారు.

విద్యార్థి దశ నుంచే సత్ప్రవర్తన కలిగి ఉంటే వారు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలిపారు. నిర్లక్ష్యంగా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ బండి నడపడం, మత్తు పానీయాలకు, దురలవాట్లకు బానిస కావడంతో విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ప్రేమ వ్యామోహాలకు విద్యార్థినులు దూరంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వికెజి మహారాణా, రెడ్డి రాధాకృష్ణ, సంజయ్ కుమార్, చావ్లా, సురేష్, పిఇటి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

ప్రజాశక్తి-కొమరాడ

ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా శిక్ష తప్పదని కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి సుగుణ తెలిపారు. శనివారం కొమరాడ కెజిబివిలో బేటి బచావో.. బేటి పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల సమన్వయంతో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బాల్యవివాహాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, కెజిబివి ఎస్ఒ జి.అరుణ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు శారద, లక్ష్మి, అరుణ పాల్గొన్నారు.

పాచిపెంట : ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పాచిపెంట కెజిబివిలో బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలు, ఆడపిల్లల ఆవశ్యకత, విద్య, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాల గురించి ఐసిడిఎస్ సిడిపిఒ బి.అనంతలక్ష్మి అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించి, ర్యాలీ చేపట్టారు.



పాచిపెంటలో ర్యాలీ చేస్తున్న ఐసిడిఎస్ అధికారులు, అంగన్వాడీలు, విద్యార్థులు

సీజనల్ వ్యాధులు సకాలంలో గుర్తించాలి

ప్రజాశక్తి - కురుపాం

సీజనల్ వ్యాధులను సకాలంలో గుర్తించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహనరావు, డాక్టర్ పిఎల్. రఘుకుమార్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలో గిరిశిఖర గ్రామాలైన డి.కీడబాయి, రాముడుగూడ గ్రామాల్లో జ్వర లక్షణాలతో ఉన్న వారి గృహ సందర్శన చేశారు. మలేరియా వ్యాధిగ్రస్తులకు ఏ విధమైన చికిత్స, మందులను వైద్య సిబ్బంది అందజేశారో పరిశీలించారు. నిర్దేశించిన కోర్సు పూర్తిగా వేసుకునేలా ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రతీ వారం గ్రామాల్లో నీటి స్వచ్ఛత పరీక్షలు నిర్వహించాలన్నారు. దోమల లార్వా వృద్ధి చెందే ప్రదేశాలను ఎప్పటికప్పుడు గుర్తించి శాఖల సమన్వయంతో నివారణ చర్యలు చేపట్టాలన్నారు.

అనంతరం ధర్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య వివరాల రికార్డులు తనిఖీ చేశారు. హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యం పై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. నీలకంఠాపురం పిహెచ్‌సిలో ల్యాబ్ తనిఖీ చేసి ప్రతిరోజూ నిర్వహిస్తున్న మలేరియా జ్వర నిర్ధారణ పరీక్షలపై చూశారు. గుంజరాడలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. జ్వర లక్షణాలతో ఉన్న వారికి నిర్వహించిన పరీక్షలు, వాటి నివేదికలు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రజ్ఞ, అభినవ్, అమరసింహారెడ్డి, సూపర్వైజర్లు జయగౌడ్, శ్రీహరి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


గిరిశిఖర గ్రామాల గిరిజనులతో మాట్లాడుతున్న వైద్యారోగ్యశాఖ పిఒలు

స్ఫూర్తి ప్రదాత అబ్దుల్ కలాం


కలాం విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆర్ట్స్ డైరెక్టర్ సన్యాసిరావు

ప్రజాశక్తి-సీతంపేట

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు కోరారు. పెద్దపేటలో ఆర్ట్స్ సంస్థ కార్యాలయం వద్ద అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా కలాం విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలాం స్వార్థం లేని వ్యక్తి అన్నారు. యువతకు అబ్దుల్ కలాం ఒక దిక్సూచని చెప్పారు. సైన్స్ పరంగా ఎన్నో అద్భుతాలు సృష్టించారన్నారు. కార్యక్రమంలో సిఇఒ బి.శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని పెదపెంకి గ్రామంలో శనివారం అబ్దుల్ కలాం వర్ధంతిని నేతాజీ గ్రంథాలయం వద్ద ఈర్ల సంజీవ నాయుడు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమం లో వడిగల్ల శివున్నాయుడు, పెంకి బలరాం నాయుడు, కోట గౌరీనాథ్, గొర్లె శ్రావణ్ కుమార్, పొందూరు ఈశ్వర్, లక్కోజు జగదీష్, పల్లి జగదీష్, బుడ్డిపు పైడిరాజు, కోట గణపతి పాల్గొన్నారు.

దోమల నివారణకు స్ప్రేయింగ్

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం మేజర్ పంచాయతీలో సచివాలయ కార్యదర్శి బి.అనిత శనివారం దోమల నివారణకు స్ప్రేయింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు దోమల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా అన్ని వీధుల్లో స్ప్రేయింగ్ చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సామరెల్లిలో సెల్ టవర్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో సామరెల్లి పంచాయతీ పరిధిలో సెల్ టవర్ ఏర్పాటు చేయాలని మన్య ప్రగతి ప్రధానకార్యదర్శి ఎం.ఉమామహేశ్వరరావు, గిరిజనులు అధికారులను కోరారు సెల్ టవర్ లేకపోవడం సిగ్నల్స్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న హెచ్‌సి కృష్ణమూర్తి

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-సీతానగరం

ఎపిజె అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా పార్వతీపురం టౌన్ పోలీస్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి సహకారంతో ఇప్పలవలస గ్రామంలో శనివారం వృద్ధులకు దుప్పట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన ఐటి కోఆర్డినేటర్ పైల సత్యనారాయణ, గ్రామ నాయకులు సూర్యనారాయణ, శ్రీరాములు, రేగునాయుడు, ప్రకాశ్ పాల్గొన్నారు.